క్లుప్తంగా

సుబ్బాలమ్మ సేవా మహోత్సవం



అమ్మవారిని దర్శించుకున్న విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయంలో పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా సేవా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. తొలుత విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో ఆ సంఘీయులు సమావేశమై సుబ్బాలమ్మ తల్లి సేవలకు శ్రీకారం చుట్టారు. అక్కడ నుంచి తల్లి ఆలయానికి సుబ్బాలమ్మ గరగలు, డప్పులతో సేవ కార్యక్రమం ఊరేగింపుగా సాగింది. ఆలయానికి చేరుకున్నాక సంఘం ప్రతినిధులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

నిత్యావసరాల అందజేత



ఉప్పంగలలో బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న దడాల వెంకటరమణ

తాళ్లరేవు: మండలంలోని ఉప్పంగల గ్రామ పంచాయతీ తెలుగోడుపాలెం గ్రామంలో పంపన చిననాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అదేవిధంగా తంగేటిపంపు గ్రామంలో కాజా లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాలకు దడాల సువర్ణలత, వెంకటరమణ దంపతులు 50 కిలోల బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పంపన శ్రీను, మట్టపర్తి శ్రీను, కృష్ణంరాజు, దొమ్మేటి సత్యనారాయణ, దొంగ మోహన్‌రావు, చీకట్ల శ్రీను, విత్తనాల శ్రీను, రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం

ఐ.పోలవరం: ఆషాఢ మాసం పౌర్ణమి మహా పర్వదినం సందర్భంగా మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం చండీ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ అర్చకత్వంలో తొలుత గణపతి పూజ, మండపారాధన, చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సుమారు 140 మంది భక్తులు ఈ క్రతువులో పాల్గొన్నారు. దేవస్థానం ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, ఆకొండి కిరణ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన ఎస్పీ కృష్ణారావు



మంత్రి సుభాష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను జిల్లా ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు ఆదివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. అమలాపురంలోని మంత్రి సుభాష్ స్వగృహంలో ఎస్పీ ఆయనను కలిసి పూలకుండీ అందజేశారు.

ఎస్పీని కలిసిన లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు



ఎస్పీ కృష్ణారావును పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

అమలాపురం రూరల్: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బి.కృష్ణారావును లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి వాకపల్లి స్వామినాయుడు, సెంట్రల్ డెల్టా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నల్లా రాంబాబు, సెక్రటరీ కురసబాబులు, అడబాల గోపాలకృష్ణ, చిట్టూరి రాంబాబు ఎస్పీని కలిసి దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.11,116 విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన చిన్ని శ్రీనివాసరావు ఆదివారం రూ.11,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును అర్చకులకు అందజేశారు. దాతను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

దోమ కాటు.. ఆరోగ్యానికి చేటు

- ప్రజలను హడలెత్తిస్తున్న దోమలు
- స్పెషల్ డ్రైవ్ చేపట్టిన మున్సిపల్, పంచాయతీ అధికారులు



అమలాపురంలో ఓ ఇంటి పెరట్లో రుబ్బురోలులో నీటి నిల్వలను ఒంపుతున్న స్పెషల్ డ్రైవ్ సిబ్బంది



ఇంటి ఆవరణలో ప్లాస్టిక్ డబ్బాల్లో నీటి నిల్వను ఒంపుతున్న వార్డు సచివాలయ సిబ్బంది



సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అమలాపురం టౌన్: వాతావరణంలో మార్పుల కారణంగా ప్రస్తుతం ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా దోమల కారణంగానే వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని దోమల నివారణకు అటు మున్సిపాలిటీ, ఇటు పంచాయతీల్లో అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వైరల్ జ్వరాలకు దోమలు, డయేరియాకు తాగునీటి కలుషితం కారణాలు కావడంతో ఆ రెండు ప్రధాన అంశాలపై అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీ, నగర పంచాయతీ, 127 గ్రామ పంచాయతీల్లో అధికారులు చర్యలు ప్రారంభించారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రజల్లో చైతన్యం పెరిగినప్పుడే దోమల నిర్మూలన సాధ్యమని అధికారులు చెబుతున్నారు.

అవగాహన ర్యాలీలు.. సదస్సులు

దోమల నిర్మూలనకు, పరిశుభ్ర తాగునీటిపై ప్రజలకు మున్సిపల్, పంచాయితీ, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తూ చైతన్య పరుస్తున్నారు. ముఖ్యంగా ఇంటి పెరట్లో, ఆవరణలో అవగాహన లోపంతోనో, నిర్లక్ష్యంతోనో దోమలు పుట్టుకకు కారణమవుతున్న పలు తప్పిదాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి ఆవరణల్లో ఉండే పూల కుండీలు, వాడి పాడేసిన టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు, ఖాళీ రేకు, ప్లాస్టిక్ డబ్బాలు ఇలా వాటిలో ఏ కొద్దిపాటి నీళ్లు నిల్వ ఉన్నా దోమల పుట్టుకకు కారణమవుతాయని వివరిస్తూనే ఆ ఇంటి కుటుంబీకుల సమక్షంలోనే వాటిలోని నీళ్లను ఒంపేస్తున్నారు. ఈ అధికారిక బృందాలు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తూనే ప్రత్యక్షంగా అలాంటి నిర్లక్ష్యం వద్దని సూచిస్తున్నారు. అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో అయితే ఆయా కమిషనర్లు ఈ రెండు సమస్యలపై మరింత అప్రమత్తమై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అమలాపురం మున్సిపాలిటీలో దోమల నిర్మూలన, తాగునీటి పరిశుభ్రత కోసం కమిషనర్ మనోహర్ ఓ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 91212 33006 ఫోన్ నెంబరును ప్రజలకు అందుబాటులో ఉంచారు. ప్రజలు ఆ రెండు సమస్యలపై 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్ ఏ సమయంలోనైనా ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. ఫాగింగ్ మెషీన్ల ద్వారా పట్టణంలో దోమల నిర్మూలనకు పొగ వదులుతున్నారు. పట్టణంలోని తాగునీటి ట్యాంకర్లను పరిశుభ్రం చేయిస్తున్నారు. వాటర్ పైపులైన్ల లీకేజీలను తనిఖీ చేసి మరమ్మతులు చేయిస్తున్నారు. పట్టణంలోని 15వ వార్డు సచివాలయాల్లోని 292 క్లస్టర్లకు సిబ్బందిని నియమించి చర్యలు చేపడుతున్నారు. పట్టణంలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్ల వద్ద ఆహార పదార్థాలు నిల్వ బారిన పడకుండా తనిఖీలు చేస్తున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీలోని 7 వార్డు సచివాలయాల్లో 7 ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 27 మంది పారిశుధ్య కార్మికులకు గాను అదనంగా మరో 10 మంది కార్మికులతో ప్రత్యేకంగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. ఇక రెండు నియోజకవర్గాల్లోని 127 గ్రామ పంచాయితీల్లో దోమలు, సీజనల్ వ్యాధులు, డయేరియా నిర్మూలనకు ఆయా శాఖల సిబ్బంది ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులను చైతన్య పరుస్తున్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో దోమలు పుట్టుకకు కారణమవుతున్న నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇంటింటా స్పెషల్ డ్రైవ్‌తో పాటు ఫాగింగ్ మెషీన్ల ద్వారా పొగ వదలడం వంటి చర్యలు చేపడుతున్నాం. సీజనల్ వ్యాధులు, దోమలు, డయేరియా సమస్యలపై మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.మనోహర్, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక..



కాట్రేనికోనలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్న 1979-80 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కాట్రేనికోన: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1979–80 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. జీవితంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుమారు 45 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. పూర్వపు విద్యార్థి మోకా మహాత్మాగాంధీ ఆనందసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ అపురూప సమ్మేళనంలో దంతులూరి రామకృష్ణంరాజు, నల్లా బేబీ జానకి, మాధబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న బాడీ బిల్డింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా క్రీడా భారతి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గ్రామీణ క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించాలని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు సూచించారు. స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా భారతి అధ్యక్ష కార్యదర్శులు అల్లాడ శరత్‌బాబు, పప్పుల శ్రీరామచంద్రమూర్తిలను ఆదివారం సత్కరించారు. అనంతరం ఇటీవల ఇండోర్‌లో ఈ నెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ జరిగే జాతీయ మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు బి.అప్పన్నను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకటరమణ, గారపాటి చంద్రశేఖర్, ముత్తాబత్తుల వెంకటరమణ, వాసంశెట్టి నరేష్, యాళ్ల బాబి, జిల్లా కోచ్ మట్టపర్తి సముద్రం తదితరులు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకావాలి

యానాం: పుదుచ్చేరి ప్రాంత అభివృద్ధి, నిధుల సాధన విషయాన్ని లేవనెత్తేందుకు జులై 27న ప్రధాని అధ్యక్షతన నిర్వహించే నీతి ఆయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి రంగసామి గైర్హాజరు కాకుండా తప్పనిసరిగా హాజరు కావాలని ఏఐఏడీఎంకే కార్యదర్శి ఎ.అన్బళగన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీతి ఆయోగ్ 19వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం న్యూఢిల్లీలో జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో పుదుచ్చేరిలో ఉన్న నిధుల మంజూరుపై, కారైకల్ ఎయిర్‌పోర్టు విస్తరణ, ఈసీఆర్ రైల్ లింక్, కరసూర్, సేదరపేట ఎకనామిక్ జోన్ తదితర అంశాలను సీఎం రంగసామి లేవనెత్తాలని కోరారు.

డిప్యుటేషన్‌లో రెవెన్యూ అధికారులు

రెవెన్యూ సేవలు అందక ప్రజలు ఇక్కట్లు



అల్లవరం తహసీల్దార్ కార్యాలయం

అల్లవరం: అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ మినహా డిప్యూటీ తహసీల్దార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు డిప్యుటేషన్‌పై వెళ్లిపోవడంతో రెవెన్యూ సేవలకు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు అల్లవరం డీటీగా విధుల్లోకి చేరిన అడపా సుబ్రహ్మణేశ్వరరావు అమలాపురం తహసీల్దార్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఏడాదిన్నర క్రితం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా విధుల్లోకి చేరిన జేవీ సత్యబాల అమలాపురం ఆర్డీఓ కార్యాలయంలో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.దొరబాబు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. అల్లవరం తహసీల్దార్ కార్యాలయం నుంచి ముగ్గురు అధికారులు డిప్యుటేషన్‌పై వెళ్లిపోవడంతో తహసీల్దార్, మండల సర్వేయర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఆరు నెలల పాటు భారీ తుఫాన్లు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదలు మండలంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇప్పటికే గోదావరి వరదలు పోటెత్తడంతో రెవెన్యూ యంత్రాంగమంతా వరద ప్రభావిత ప్రాంతాల్లో విధుల్లో ఉంటే కార్యాలయంలో రెవెన్యూ సేవలు అందించేది ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధిక వర్షాలు, వరదలు, ముంపు ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని డిప్యుటేషన్‌పై వెళ్లిన అధికారులను యథావిధిగా అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తించేలా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ సునీల్‌కుమార్‌ని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి డిప్యుటేషన్‌పై వెళ్లిన అధికారులకు తిరిగి పంపించాలని కోరతామని తెలిపారు.

ముంపులోనే వరి పొలాలు

- ఆందోళనలో అన్నదాతలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గౌతమీ గోదావరి



అన్నంపల్లిలో ముంపు బారిన పడిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తదితరులు



గౌతమీ గోదావరి వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి



చిందాడగరువులో ముంపులో వరి చేలు

ముమ్మిడివరం: గోదావరి ఎగువన నీటి మట్టం పెరగడంతో మండలంలో వృద్ధ గౌతమీ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో గోదావరిలో నాటు పడవలతో రాకపోకలు సాగించరాదని హెచ్చరికలు జారీ చేశారు. అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో నీట మునిగిన వరి చేలు ఇంకా ముంపు నుంచి తేరుకోలేదు. వేసిన నాట్లు, నారుమడులు గత నాలుగు రోజులుగా ముంపులోనే ఉండటంతో దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధానంగా అయినాపురం ప్రధాన పంట కాలువల పక్కన ఉన్న వరి పొలాలు నీటిలో మునిగిపోవడంతో దెబ్బతిన్నాయి. అయినాపురం, కొత్తలంక, సీహెచ్ గున్నేపల్లి గ్రామాల్లో వరి పొలాలను సర్‌ప్లస్ వియర్ ద్వారా వచ్చే నీరు ముంచెత్తుతోంది. భారీ వర్షాల కారణంగా నీట మునిగి నష్టపోయిన వరి రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హామీ ఇచ్చారు. అన్నంపల్లి, కొత్తలంక గ్రామాల్లో ముంపుబారిన పడిన వరి చేలను ఆదివారం ఆయన పరిశీలించారు.

అమలాపురం రూరల్: అల్పపీడనం కారణంగా గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల వల్ల అమలాపురం మండలంలో వరి చేలు నీట మునిగాయి. రూరల్ మండలంలోని 150 ఎకరాల మేర వరి చేలు ముంపునకు గురయ్యాయి. ఎ.వేమవరం, తాండవపల్లి, భట్నవిల్లి, జనుపల్లి, నల్లమిల్లి, కామనగరువు, వేమవరప్పాడు, సమనస, ఇమ్మిడివరప్పాడు, రోళ్లపాలెం, భట్నవిల్లి, రెడ్డిపల్లి తాండవపల్లి, భట్నవిల్లి, రెడ్డిపల్లి, నడిపూడి, వేమవరప్పాడు గ్రామాల్లో వరిచేలు ముంపులో చిక్కుకున్నాయి. ఇటీవలే వరి నాట్లు వేయడంతో వర్షాల కారణంగా కొన్నిచోట్ల వరి దుబ్బులు నీటిపై తేలుతుంటే మరి కొన్ని వరి దుబ్బులు నీట మునిగి కుళ్లిపోతున్నాయి. మండలంలోని 22 గ్రామాల్లో 5,081 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 1,857 ఎకరాల్లో అన్నదాతలు వరినాట్లు వేశారు. డ్రైనేజీలు మూసుకు పోవడంతో ముంపు నీరు దిగే మార్గం లేక వరి నాట్లు కుళ్లిపోతున్నాయి.

యానాం: గౌతమీ గోదావరి వరదనీటి ప్రవాహం పెరిగిన నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆర్ఏఓ మునిస్వామి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ రివర్ బీచ్, జీసెస్ స్టాట్యూ, పుష్కర ఘాట్ తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద నీరు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యల గురించి పీడబ్ల్యూడీ అధికారులకు ఆదేశాలిచ్చారు.

కాట్రేనికోన: గోదావరి నదిలో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కుండలేశ్వరం పుష్కర ఘాట్‌లో స్నానాల రేవు వద్ద హెచ్చరికల బోర్డులను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు వరదలు తగ్గే వరకూ నదిలో స్నానం చేయొద్దని సూచించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు



అమలాపురం స్వర్ణ శిఖర షిర్డీ సాయి ఆలయంలో సాయి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పి.మల్లవరంలో ముత్యాలమ్మకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



ముమ్మిడివరంలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులతో పోటెత్తిన బాబా ఆలయాలు

అమలాపురం టౌన్: గురు పౌర్ణమి సందర్భంగా పట్టణంలో ఉన్న దాదాపు 39 షిర్డీ సాయి ఆలయాల్లో భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచి పోటెత్తారు. సాయిబాబాకు క్షీరాభిషేకాలతో పాటు వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయి చరణాన్ని భక్తులు స్మరించారు. ముఖ్యంగా పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని స్వర్ణ శిఖర షిర్డీ సాయి ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి పూజలు చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న 216 జాతీయ రహదారి కూడా భక్తులతో రద్దీగా కనిపించింది. పట్టణంలోని సావరం, అన్నాబత్తుల వారి వీధి, నారాయణపేట, సూర్యనగర్, కొంకాపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, వడ్డిగూడెం తదితర ప్రాంతాల్లోని షిర్డీ సాయి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సాయిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద గల లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ఆధ్యాత్మిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రేలంగి కుమార్ శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో వేద వ్యాసుని జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీకామాక్షీ పీఠాన్ని జిల్లా బీజేపీ కమిటీ నాయకుల బృందం ఆదివారం రాత్రి సందర్శించింది. ఈ సందర్భంగా పీఠాధిపతి కామేశ మహర్షిని సత్కరించారు.

ముమ్మిడివరం: గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని సాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముమ్మిడివరం సాయిబాబా మందిరం వద్ద అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తాళ్లరేవు: పవిత్ర ఆషాఢ పౌర్ణమి సందర్భంగా పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ధూళిపూడి చిట్టిబాబు, పద్మశ్రీ దంపతులచే వేద పండితులు ఖండవిల్లి సత్య శ్రీనివాస్ అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు విల్ల సత్యనారాయణ, వీర, పితాని సత్యవతి తదితరులు పాల్గొన్నారు. కోరంగి పంచాయతీ సీతారామపురం సాయిబాబా ఆలయంలో సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుదీర్ఘ కాలంగా ఆలయంలో భజన కీర్తనలు ఆలపిస్తూ సంగీత సేవ చేస్తున్న భజన గురువులు గెద్దాడ వెంకటేశ్వరరావు, గోవిందులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి, లక్ష్మణరావు, నరాల ఏడుకొండలు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురంలో గురుపౌర్ణమి సందర్భంగా భజన గురువులను సత్కరిస్తున్న దృశ్యం



బుద్ధుని విగ్రహానికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తదితరులు

అమలాపురం రూరల్: స్థానిక త్రిరత్న బుద్ధ విహార్ ప్రాంగణంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుని విగ్రహానికి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పూలమాలలు వేసి పూజలు జరిపారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ అధ్యక్షుడు పిల్లి రాంబాబు, బుద్ధ విహార్ చైర్మన్ నాగబత్తుల ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి డీబీలోక్ పాల్గొన్నారు.

కాట్రేనికోన: స్థానిక మావుళ్లమ్మ దేవస్థానంలో వేంచేసి ఉన్న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అష్టోత్తరాలు జరిగాయి. ఈ సందర్భంగా బాబాకు మహిళలు క్షీరాభిషేకం చేశారు. విద్యార్థులు గురువులను సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయాల వద్ద సామూహిక అన్న ప్రసాద కార్యక్రమాలు చేశారు.

ఉప్పలగుప్తం: గురు పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలో విలసవిల్లి, కూనవరం, చల్లపల్లి, భీమనపల్లి, గొల్లవిల్లి గ్రామాల్లో సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లపల్లి గ్రామంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, రాంబాబు దంపతులు బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

గురువులకు పూర్వ విద్యార్థుల సత్కారం



గిరియాంపేట ప్రభుత్వ స్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

యానాం: స్థానిక గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2013–14లో చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు గురుపౌర్ణమిని పురస్కరించుకుని తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. గిరియాంపేట, సావిత్రినగర్ తీరప్రాంత గ్రామాల 50 మంది విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు, టీచర్లు దాట్ల శ్రీకాంత్‌వర్మ, పెసల జయరామయ్య, టిల్లపూడి సుబ్రహ్మణ్యం, వీపీఎస్ఎన్ కిషోర్, వీవీ వినాయకరావు, కె.గంగరాజు, పి.రోజారాణి, నళిని తదితరులను దుశ్శాలువాలతో సత్కరించారు. స్థానిక జవహర్ బాల్‌భవన్‌లో గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా శాస్త్రీయ నృత్య ఉపాధ్యాయురాలు శ్రీవాత్సవిని పూర్వ విద్యార్థినులు ఘనంగా సత్కరించారు.